# డ్రిల్ మాస్టారూ ఎక్స్ స్టూడెంటూ

డాక్టర్ రాధాకృష్ణ హాస్పిటల్‌నుంచి ఇంటికి వచ్చి కారు లాక్‌చేసి హాల్లోకి వస్తూండగానే భార్య మధుమతి నవ్వుముఖంతో ఎదురు వచ్చింది.

"మధూ. ఆకలి మండిపోతూంది, త్వరగా వడ్డించెయ్యి" అంటూ బట్టలు మార్చుకుని, టవలు భుజాన వేసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. మధుమతి డైనింగ్ టేబిల్ మీద రెండు ప్లేట్లలోనూ వడ్డించి కుర్చీలాక్కుని కూర్చుంది.

"బాబూ, పాపా స్కూలుకి వెళ్ళారా" అంటూ వచ్చి కూర్చుని భోజనం చేస్తూంటే మధుమతి తనూ తింటూ భర్తకి వడ్డిస్తూ "ఈ రోజు మీ మామయ్య దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది" అంది.

"నిజం! ఇంతసేపూ చెప్పవేం?"

"సాంబారు కావాలా?"

"అబ్బ! అవన్నీ తరవాత. ముందు ఉత్తరంలోని విషయాలు చెప్పు."

చిరు కోపం ప్రదర్శిస్తున్న భర్తని చూసి నవ్వి "భోజనం పూర్తి కానివ్వండి" అంది.

"లాభం లేదు."

"అబ్బ, ఉత్తరం చదవడంలో ఆకలికూడా మరిచిపోతారనే చెప్పలేదు."

"సగం ఆకలి తీరిందిగా! చెప్పు. లేకుంటే ఉత్తరం ఇవ్వు!"

"ఉహూఁ."

"మధూ, చెయ్యి కడిగేస్తాను-తెలుసా"

నీళ్ళగ్లాసు ఎత్తి బెదిరిస్తున్న భర్త చెయ్యి గట్టిగా పట్టుకుని- "అబ్బబ్బ, ఎరక్కపోయి ముందుగా చెప్పాను. ఉత్తరం ఇస్తాను, మీరే తృప్తిగా చదువుకోండి" అంటూ లేచి కవరు తెచ్చి అందించింది.

ఎడంచేత్తో కవరు అందుకుని లోలోపల ఇలా చదువుకున్నాడు.

చి. రాధా

చాలా రోజులకి ఉత్తరం రాస్తున్నానుకదూ. రోజులేమిటీ సంవత్స రాలైంది మామయ్యా అంటావా! నిజమే. తరుచుగా ఉత్తరాలు రాయాల నిపించినా ఈ పల్లెటూరూ పొలంపనులూ-వీటితో సతమతమవుతూ కొన్ని అశ్రద్ధ చేసే మాట నిజం. కానీ, ఉత్తరాలేమైనా వచ్చాయేమో అని పోస్టు మన్ కొరకు ఎదురు చూడటం నాకు అలవాటని నీకు తెలుసుగా!

'నువ్వు మాత్రం రాయకుండా ఉత్తరాలు రావాలని ఎదురుచూడటం అన్యాయం మామయ్యా' అనే నీ మాటలు ఇంకా గుర్తున్నాయి. 'నామాటలే తప్ప నే గుర్తులేనూ' అని తగూ పెట్టుకునేందుకు నువ్వు కారు తీసుకుని

సరాసరి వచ్చినా ఇబ్బంది ఏం లేకుండా ఈ ఊరికి నంబర్‌వన్‌గా రోడ్డు వేయించేశాం. పాత రోజుల్లోనూ పది రోజులు ముందు ఉత్తరం రాసి బస్సు దగ్గరికి బండి పంపితే గతుకుల రోడ్డులోపడి రావలసిన పనిలేదురా!

ఇంతకీ నే నీ ఉత్తరం రాయవలసి వచ్చిన విషయం వదిలి ఉపోద్ఘాతంతోనే పేజీలు నింపానని నవ్వక ముందే ఆగి సూటిగా చెప్పేస్తున్నాను. రాధా! మీ ఊరివాళ్ళకో మంచి ఉద్దేశ్యం వచ్చింది. ఏమంటే, ఈ ఊళ్ళో కస్తూరీ హైస్కూలు స్థాపించి పాతిక సంవత్సరాలు పూర్తి అయింది గనక సిల్వర్‌జూబ్లీ చెయ్యాలనీ, ఆరోజుకి స్కూల్లో చదివిన ఓల్డ్ స్టూడెంట్స్ అందరినీ ఈ సమావేశానికి రప్పించాలనీనూ. ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నాం. ప్రెసిడెంటుగారే నడుం కట్టి నిలిచారు. ఉడతాభక్తిగా నేనూ సాయం చేస్తూన్నాననుకో. నువ్వీ హైస్కూలు ఓల్డ్ స్టూడెంట్ కనక తప్పక రావాలి ఆలాగే మధుమతినీ, నీ బుల్లి హీరోయినూ హీరో (బాబూ, పాపా)నికూడా తీసుకుని రా. వాళ్ళని నే నింతవరకు చూడలేదురా, రాధా. నీ ఎరికెలా ఈ కస్తూరి హైస్కూలు స్టూడెంట్సు ఉంటే తప్పక రమ్మనిచెప్పు. నీకు స్కూలునించి వేరే ఆహ్వానం వస్తుందనుకో తప్పకవస్తానని ఎదురుచూస్తూ అన్నట్లు మీ అత్తయ్య నీ కోసం జున్నూ, జీడీలూ తయారు చేస్తుందిట, మామయ్య.

"హాయ్-మధూ ఇంత మంచివార్త తెచ్చిన ఉత్తరం ఇవ్వటానికి ఇంత ఆలస్యం చేస్తావా?" సంతోషాన్ని అదిమిపెట్టుకుంటూ కోపంగా భార్యవైపు చూశాడు.

"వస్తూనే ఆకలి అన్నారుగా అందుకు. అరె....చెయ్యి కడిగేశారేంటి పెరుగు వేసుకోలేదు."

"ఔనుకదూ! మరిచిపోయాను. పోనివ్వు, రాత్రికి తింటాను."

టవల్‌తో చెయ్యి తుడుచుకుంటూ కుర్చీ వెనక్కి నెట్టి లేవబోతూంటే మధుమతి–"వీల్లేదు. నీళ్ళు కడిగి పెడతాను. లేకుంటే మరో ప్లేటు పెట్టనా! అదీవీల్లేదూ. అయితే ఈకాస్త పెరుగూ స్పూనుతో తినేయండి."

"అబ్బబ్బ! గెలుపెప్పుడూ నీదే" అంటూ కప్పు పెరుగు తినేసి లేచి హాలులోకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. సంతోషంతో మనస్సు అలా తేలిపోతూంది రాధాకృష్ణకి. అసలు ప్రాక్టీసుతో క్షణం తీరుబడి ఉండదు. భాగ్యనగరంలో బంగళా, కారూ వగైరా అంతస్తుకి తగ్గట్టు అమర్చుకున్నాడు. అనుకూలవతి అయిన భార్య, ఒక కొడుకు, ఒక కూతురుతో సంతానానికి ఫుల్‌స్టాఫ్ పెట్టి ఇల్లే 'స్వర్గం' అన్న పదానికి అర్థం అన్నట్లు రోజులు క్షణాల్లా దొర్లిస్తూన్నాడు. ఆలోచనల్లో తేలిపోతూనే "మధూ, నువ్వు మామయ్యగారి ఊరు చూడలేదు కదూ!" అంటూ కేకపెట్టాడు.

"మీరు తీసుకు వెడితేగా..."

"ఈ సారి తప్పక వెడదాం. ఏం?"

"ఎవరికన్నా అప్పగిస్తాను. ఏమైనాసరే ఈ ప్రోగ్రాముకి వెళ్ళి తీరాలి."

"నాలుగు రోజులైనా పట్టదూ?"

"చూద్దాం" అంటూ లేచి మంచంమీదికి వెళ్ళి పడుకున్నాడు విశ్రాంతిగా, మధుమతి ఆ గదిలోనించి బయటికి వెళ్ళింది.

రాధాకృష్ణకి ఎన్నో చిన్నప్పటి విషయాలు గుర్తు కొస్తూన్నాయి. తన బాల్యం తాతగారి ఊరిలో గడిపిన రోజులు, హైస్కూలు జీవితంలోని ఎన్నో మధురస్మృతులు అతన్ని కదిలిస్తూ ఎన్నో సంవత్సరాల వెనక్కి లాక్కుపోయినాయి.

తండ్రికి దూరప్రాంతాల్లో ఉద్యోగం.... పైగా ట్రాన్స్‌ఫర్లూ. పిల్ల

వాడి చదువుపాడై పోతుందనే భయం. అంతకుమించి ఏకైక పుత్రుడిని వదిలి ఉండలేక తల్లిపడే బాధ. తాతగారూ అమ్మమ్మా "మరేం ఫర్లేదు. రాధని మా దగ్గర ఉంచుకుని హైస్కూలు చదువు పూర్తి అయే వరకూ చెప్పిస్తాం. నీకంటే వెయ్యిరెట్లు బాగా చూస్తాం" అని ధైర్యం చెప్పి ఒప్పించడంతో ఆ ఊరిలోని హైస్కూల్లో తనచదువు మొదలైంది.

ఓ మాదిరిబస్తీ లాంటి పల్లెటూరు. అందులో హైస్కూలు తెచ్చు కున్నారు. ఆ స్కూలు తెప్పించడానికి తాతగారు చేసిన కృషి కథలుగా చెప్పేవాళ్ళు కొందరు. ఆ ఊళ్ళో స్కూల్లోచేరిన కొత్తలో అమ్మనీ, నాన్ననీ వదిలి ఉండటం చాలా కష్టమే అయింది రాధాకృష్ణకి. పగలు చదువూ ఆటలతో కాలం గడిచినా రాత్రి అయేసరికి తల్లీ, తండ్రీ గుర్తుకొచ్చేవాళ్ళు. అమ్మమ్మా, తాతయ్యా మంచాలమధ్య తన మంచం అయినా దుఃఖం కట్టలు తెంచుకునేది. అలా రాత్రులు నిశ్శబ్దంగా ఏడుస్తూంటే తాతయ్యలేచి ఓదార్చి కబుర్లు చెపుతున్నా, పగలల్లా ఇంటిపనితో అలిసి నిద్రపోయే అమ్మమ్మకి చచ్చినా మెలకువ వచ్చేదికాదు. తాతయ్య "రాధా! అలా చూడు-చందమామ మబ్బుల్లో ఎలా దాక్కుంటున్నాడో" అంటూ ఓదార్చడానికి ప్రయత్నిస్తూనే పెద్దగా ఆవులిస్తూ ఉండేవాడు. ఆయన అలా అంటూన్న కొద్దీ మరీ వెక్కిళ్ళు పెట్టి ఏడ్చేవాడు. గదిలో పడుకున్న మామయ్యకి మెలుకువవచ్చి లేచి దగ్గరకొచ్చి తండ్రిని పడుకోమని ఏవో పాత హిందీ సినిమా కథలు చెపుతూంటే, ఆ కథ వింటూనే ఎప్పుడు నిద్రపోయేవాడో తనకే తెలియదు. ఒక్కసారి మెలుకువవచ్చి చూస్తే దగ్గరగా పడుకొని ఉండేవాడు మామయ్య మళ్ళీ కళ్ళుమూసుకొని నిద్రలోకి జారిపోయిన రోజులు చాలానే ఉన్నాయి.

తెల్లవారి అత్తయ్య గడ్డపెరుగు వేసి అన్నం పెడుతూ ఉడికించి హేళనగా నవ్వుతూంటే బలే కోపం వచ్చేసేది రాధాకృష్ణకి. ఏం మాట్లాడ కుండా అన్నం తిని పుస్తకాలు పట్టుకొని పరుగుతీసేవాడు. ఓ సంవత్సరం

అయేసరికి ఆ ఊరు అలవాటై పోయింది. ఆ పల్లెటూరూ, స్కూలు స్నేహితులూ, వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసంలో పెట్టే దద్దోజనం కోసం బాదంచెట్టు ఎక్కి కసిక్కున కుట్టే గండుచీమలనికూడా లెక్క చెయ్యక ఫ్రెండ్స్‌కి కూడా కోసి ఇచ్చి హీరోలా అందరికంటే ముందు పరుగు తీసేవాడు.

ముసలి ఆచార్లగారితో అబద్ధం చెప్పి మరోసారి ఆకులో ప్రసాదం పెట్టించుకుని పక్కవాళ్ళని గర్వంగా చూస్తూ ప్రహరీదూకి పరుగుపెట్టడం గుర్తుకొస్తూంటే, ఇప్పటికీ కళ్ళెదుట జరిగినట్టే ఉంటుంది.

అమ్మమ్మా, తాతయ్యాచేసే ముద్దు తనని మొద్దబ్బాయిగా చేస్తూన్నట్లు గ్రహించిన అమ్మ ఆరాటపడిపోయి రహస్యంగా తమ్ముడిని హెచ్చరిస్తూ ఉత్తరం రాయటం, అప్పటినించీ మామయ్య క్రమశిక్షణ పేరుతో స్వేచ్ఛని అరికట్టటం గుర్తుకొస్తే ఇప్పుడు నవ్వు ముంచుకొస్తుంది. ఈ క్రమశిక్షణ మాటలలో, వార్నింగులలో ఆగాక ఒకసారి దెబ్బల వరకూ వెళ్ళింది.

క్లాసులో లలితని ఏడిపించడంతో ఆగక 'లల్లీ లిల్లీ నా మల్లీ'' అనటం కూడా చేశాడు. ఆ పిల్ల ముఖం ఎర్రబడి మింగేలాచూసి భోరున ఏడ్చేసింది. అదిచూసి తను మరీ హుషారుపడటం, స్నేహితులు అంతటితో ఆగద్దని, ప్రేమలేఖ అందించేయమని రెచ్చగొట్టటం, తను తెలిసీ తెలియక ఏదేదో రాసి ఆ పిల్లకి పంపటంతో కొంప అంటుకున్నంత పని అయిందీ. హెడ్మాస్టరు వరకూ వెళ్ళి అలా అలా మామయ్య దగ్గిరికి చేరింది. మామయ్య కోపంతో నాలుగు వడ్డించడంతో అభిమానం లలితని మింగేయా లన్నంత కోపం, మామయ్య నన్ను కొడతాడన్న పౌరుషం కలగాపుల గంగా కలిపి ఇల్లు వదిలి ఎవరికీ చెప్పకుండా విజయవాడ వరకూ వచ్చేలా చేసింది.

అమ్మమ్మా, తాతయ్యా హడిలిపోయి నూతులూ గోతులూ వెతికి మామయ్య మీద యుద్ధం ప్రకటించటంతో ఆయన భయపడి ఊళ్ళమీద

వెతకటానికి పడి అమ్మకి టెలిగ్రామ్ ఇచ్చి ఆఖరుకి విజయవాడలో రైలెక్కుతున్న తనని పట్టుకుని వెనక్కి తీసుకు వెళ్ళడం అన్నీ గుర్తుకొస్తున్నాయి రాధాకృష్ణకి. తెలిసీ తెలియక చేస్తూన్న వెధవ పనులని ఓసారి వివరంగా ఆలోచించుకునేలా చేసింది మామయ్య కొట్టిన చెంపదెబ్బ. ఆ తరువాత మరెప్పుడూ మామయ్యకి రిపోర్టు అందనీయలేదు. బుద్ధిమంతుడిలా స్కూలు ఫైనలు పాసై ఆ ఊరి హైస్కూలుకి గుడ్‌బై కొట్టి కాలేజీలో చేరి అమ్మా, నాన్నా దగ్గరే చదువు పూర్తి చేసుకోగలిగాడు. అప్పుడప్పుడూ సెలవుల్లో అమ్మమ్మగారి ఊరు వెళ్ళి పాత దోస్తులని కలుసుకుని మాస్టార్లని పరామర్శించి నాలుగురోజులు సరదాగా గడిపి తిరిగి వచ్చేవాడు. ఇలా సెలవుల్లో వెళ్ళినప్పుడల్లా ఒంటెద్దు బండీ, రెహమానూ, డ్రిల్ మాస్టారు మూర్తిగారూ మరీ మరీ ఆప్తులుగా మిగిలిపోయారు. తరువాత ఎమ్.బి బి.ఎస్. లో చేరడం, అమ్మమ్మా తాతగారూ పోవటంతో ఆ ఊరి రాకపోకలు తగ్గిపోయాయి. అయినా పిల్లలకి క్రమశిక్షణ శరీరానికి, చదువులో మనస్సుకి రావాలి అని గట్టిగా వాదించే డ్రిల్ మాస్టారు ఎప్పుడూ తనని కారు దిగగానే బండిలో ఎక్కించుకుని ఎంకి పాటలు పాడుతూ మూడు మైళ్ళ గతుకుల రోడ్డన్న మాటని మరిపిస్తూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండే రెహమాన్ తన క్లాసుమేట్ ఏడవ తరగతిలో. కానీ, ఆర్థిక పరిస్థితి కారణంగా హైస్కూలు చదువు మధ్యలోనే వదిలి బండినీ, ఎద్దుని కొనుక్కుని కిరాయికి తిరిగే రెహమాన్‌ని చూస్తే జాలీ, ప్రేమా ముంచుకొస్తూ ఉండేది. ఒకసారి బండీ బాడుగ తీసుకోమని బలవంతం చేస్తూ మరో పదిరూపాయల కాగితం అతని గుప్పెట్లో కుక్కినా తీసుకోకుండానే రెహమాన్, "రాధ బాబూ! మన ఇద్దరం ఓనాటి దోస్తులం. నీ దగ్గిర ఇప్పుడే కాదు, ఎప్పుడూ డబ్బు తీసుకోలేను. నా ఋణం తీర్చుకోలేవని భయపడకు. నువ్వు డాక్టరువిగా. నే ఓసారి వచ్చి నీ ఇంట్లో ఉంటాను. లేకుంటే నీ దగ్గిర కంపౌండరుగా వచ్చేస్తాను. ఏం-రమ్మంటావా" అంటూ

నవ్వి ఖాళీబండీ తోలుకుంటూ వెళ్ళిపోయాడు.అతను ఇప్పుడెలా ఉన్నాడో! అన్నట్టు డ్రిల్ మాస్టారు ఎలా ఉన్నారో! ఒక్కరోజు డ్రిల్ కి రాకున్నా ఆయన సహించలేకపోయేవారు. పైగా ప్రతి కుర్రాడూ గుర్తే ఆయనకి.

చదువు అయి ప్రాక్టీసు పెట్టడం, పెళ్ళి చేసుకోవడం, అమ్మా, నాన్నా పోవడంతో జీవితం పూర్తిగా మారిపోయింది. మామయ్య నాలుగు సార్లు రమ్మని రాసినా వీలుకాక వెళ్ళలేకపోయాడు. హఠాత్తుగా ఈ ఉత్తరంతో రాధాకృష్ణ బాల్యజీవితం అంతా సుడి తిరిగినట్లయింది.

"వెళ్ళాలి. తప్పక వెళ్ళిరావాలి." దృఢ నిశ్చయంతో లేచాడు.

కాన్వెంట్ నించి యూనీఫారమ్ దుస్తులతో పిల్లలిద్దరూ ఇల్లు చేరారు. "డాడీ..." అంటూ స్కూలు కబుర్లు మొదలెట్టింది పాప.

*  *  *  *

రాధాకృష్ణ కారులో భార్యనీ, పిల్లలనీ తీసుకుని బయలుదేరాడు. మేనమామకి పొందూరు ఖద్దరు పంచా, ఉత్తరీయం, అత్తకి మాధవరం జరీచీరా తీసుకుని. మధుమతి స్వీట్లు కూడా తెమ్మన్నది. అన్నీ తీసుకుని బయలుదేరారు. సూర్యాపేటలో ఆగి, కాఫీ టిఫినూ తీసుకుని విజయవాడలో రాత్రి మనోరమలో దిగి తెల్లవారిస్నానం అదీ పూర్తి చేసుకుని మేనమామ గారి ఊరుకి బయలుదేరాడు.

"మామయ్య రాసినట్లు రోడ్డు ఫరవాలేదు అనుకుంటూ పాత జ్ఞాపకాలని నెమరు వేసుకుంటున్నాడు. ఊరు రానే వచ్చింది. ఏ మంతగా మారినట్టు లేదు. అయితే, కొన్ని కాఫీ హోటళ్ళూ, బట్టల దుకాణాలూ కొత్తగా కనిపించాయి. కూరల మార్కెట్టు కూడా వెలిసినట్లుంది.

నాలుగు రోడ్ల జంక్షన్‌లో కారు స్లోగా పోనిస్తూ - 'సార్! ఎటు' అని అడిగాడు డ్రైవరు. అప్పుడే కొందరు పిన్నలూ పెద్దలూ వంగి కారు లోకి చూస్తూ ఎవరింటి కెళ్ళాలీ అని అడుగుతున్నారు.

"అటు రైటుకి పోనివ్వు, ఆఁ అదిగో, ఆ డాబా ఇల్లు" అంటూడ గానే డ్రైవరు హారన్ వేసి కారు ఆపాడు. మామయ్య అప్పుడే వాకిట్లోకి వచ్చేశాడు. ఆయన వెనక అత్తయ్య చిన్న కూజాబిందె అంత చెంబుతో నీళ్ళు తెప్పిస్తూంది. పాలేరు సామానులు దింపటానికి కారు వెనక్కి వచ్చే శాడు, తలకి తువ్వాలు చుట్టుకుంటూ.

"అరె, రాధా! అదేంటీ మధుమతి అంత చిక్కిపోయిందా! ఏరీ మీ బుల్లి హీరో హీరోయినూ? వీళ్ళిద్దర్నీ కాన్వెంటులో చేర్పించావు కదూ! ఈ ఊళ్ళో హైస్కూల్లో ఆమాత్రం చదువు చెప్పరనా, లేక మీ ఆవిడ వదిలి ఉండలేదనా" అంటూనే పిల్లలిద్దరినీ దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టుకుని- "రండి లోపలికి, రాధా! నే నింకా ఈ ఊళ్ళో ఉండగానే నీ రాకపోకలు తగ్గిస్తే ఎలాగురా" అంటూంటే ఆయన గొంతు జీరగా పలికింది. రాధాకృష్ణ కళ్ళలో నీటిపొర కదిలింది.

"లేదు, మామయ్యా! రావాలనే ఉన్నా బొత్తిగా తీరుబడి లేకుండా ఉంది" అన్నాడు ఎలాగో ఒకలాగా.

"మీ అత్తయ్య వేడినీళ్ళు, వేడివేడి ఉప్మా ఫిల్టర్ కాఫీ రెడీ చేసే సింది. రండి" అంటూంటే మధుమతి ముందు లోపలికి నడిచింది. ఇంతలో ఎవరో "రాధ బాబూ! అరెరె...ఎంత మారిపోయావూ" అంటూ పలక రించింది ఓ ముసలావిడ.

"నేనే, అమ్మమ్మా, బాగున్నావా! మీ పిల్లలంతా బాగున్నారా!" కబుర్లు చెపుతూంది ఆవిడ. వింటున్నాడు రాధాకృష్ణ. ఇంతలో వెనక

నుంచి ఒక లారీ, దాన్నిండా మనుషులూ ఆగిఉన్న అంబాసిడర్ కారుని తప్పించుకుని ముందుకు వెడుతూ ఉంటే ఆ లారీలోని వాళ్ళని చూస్తూ అలాగే నిలుచున్నాడు.

"ఒరే, శేఖరంగా, వచ్చావురా! పాత స్టూడెంటువీ" ముసలమ్మ వాళ్ళని పలకరిస్తూంది. ఇంకా ఏవేవో పలకరింపులూ, నవ్వులూ, కబుర్లూ.

ఆ ముఖాల్లో కొన్నింటిని గుర్తుకు తెచ్చుకుంటూన్నాడు. లారీకి ముందు "కస్తూరీ హైస్కూలు ఎక్స్‌స్టూడెంట్లు" అన్న రంగు రంగు అక్షరాలున్న బట్టగాలికి కదులుతూ ఎగురుతూంది.

"రేయ్, రాధా!" ఒక్క ఉరుకు ఉరికి రాధాకృష్ణని గట్టిగా వాటేసుకున్నాడు దుమ్ముతో నిండిన బట్టలున్న నడి వయస్కుడు.

రాధాకృష్ణ ఉలిక్కిపడి పట్టులో నిండిన ఆ చేతుల నించి తప్పించుకుంటూ అతని ముఖంలోకి చూసి గుర్తించి - "అరె! శర్మా, నువ్వా!" అని తోసేయబోయిన చేతులని ఆత్మీయంగా నొక్కుతూ మరీ దగ్గరికి లాక్కుంటూ ఉంటే పాప విసుగ్గా ముఖం పెట్టి - "డాడీ! రండి లోపలికి పోదాం" అంటూంది కానీ, ఆ మాటలు వినిపించడం లేదు.

"ఓయ్, రాధాకృష్ణా; గుడ్‌మార్నింగ్" అంటున్నాడు మరొక అతను.

"డాక్టర్ అయాడా ఇతనూ" అంటూంది మరొక గొంతు.

"హల్లో, వాసూ! మీరంతా ఎలా కలిశారూ!" రాధాకృష్ణ శర్మవైపు తిరిగి అడుగుతూంటే. "ఒరే...రండిరా. మాటలు తరవాత. ముందు విడిది చేరాలి. కాఫీ పోసుకుని ఊరిమీద పడదాం" అంటూంటే, లారీ బయలుదేరుతూంటే శర్మ పరుగున వెళ్ళి లారీ అందుకుని పైకి ఎక్కి

"రాధా, నువ్వు వస్తావా మా విడిదికి" అన్నాడు. మామయ్యా' మీరే రండిరా' అని బిగ్గరగా కేకపెడుతూన్నాడు. రాధాకృష్ణకి కూడా పరుగున వెళ్ళి ఆ లారీ అందుకుని ఎక్కి వాళ్ళలో ఒకడై హాయిగా అల్లరి చెయ్యాలనే కోరిక క్షణం మెదిలింది కానీ, అలా దుమ్ము కొట్టుకుంటూ వాళ్ళలో కలవ గలడా ఇప్పుడు? ఆగిపోయాడు అలాగే.

"శర్మగారు ఉద్యోగం దొరక్క లారీ డ్రైవరై తరవాత ఆలారీనే కొనేసుకుని వ్యాపారంలోకి దిగాడు. డబ్బు చాలా గడించినా, ఈ లారీ అంటే వాడికి ప్రాణం. ఎక్కడికైనా సరే లారీలోనే వెడతాడు. గుడివాడలో ఉన్న స్నేహితులని ఈ లారీలోవేసి లాక్కువచ్చినట్లున్నాడు. వాడి అల్లరి అప్పటికీ, ఇప్పటికీ అలాగే ఉందిరా. ఈ ఊరికి ఎప్పుడొచ్చినా హైస్కూలునీ, డ్రిల్‌మాస్టారునీ, నన్ను చూడందే వెళ్ళడు. నీకేకాదు, హైస్కూల్లో చదివే ప్రతి స్టూడెంటుకీ నేను మామయ్యనే" అంటూ మామయ్య లోపలికి దారితీశాడు.

మరో ట్రాక్టరులో కొందరు పెద్దగా కేకలు పెడుతూన్నారు. 'కస్తూరీ హైస్కూలుకీ జై' అంటూ. అదీ స్టుడెంట్సు కోసం చేసిన విడిది వైపు వెళ్ళిపోతూంటే. ఓ అడుగు వెనక్కివెళ్ళి ఆరోడ్డు మలుపు తిరిగేవరకూ చూస్తూ అలాగే నిలిచిపోయాడు డాక్టర్ రాధాకృష్ణ.

"రాధా! రారా కాఫీ చల్లారిపోతూంది." మేనమామ కేకకి లోపలికి వెళ్ళి ఇల్లు నాలుగు మూలలా పరీక్షగా చూస్తూ షర్టు విప్పి చేత్తో పట్టుకుని 'హేంగరులేదు, మామయ్యా' అంటే అత్త నవ్వి 'పల్లెటూరి వాళ్ళకి మేకులే హేంగర్లు' అంటూంది లోపలినించి. అప్పుడే పిల్లలిద్దరూ టిఫిను తిని పెరటిలో అవుదూడని చూస్తూ అల్లరి చేస్తున్నారు.

"డాడీ! ఈ దూడని హైదరాబాద్ పట్టుకెడదాం" అంటూంది పాప "డిక్కీలో ఎక్కించేస్తా" అంటున్నాడు బాబు.

టిఫినూ కాఫీ అయిన తరువాత ఇల్లు అంతా చూసి, పెరడంతా చూసి, మొక్క మొక్కా పరీక్షించి మామయ్యతో కబుర్లకి దిగాడు.

"సపోటా, దానిమ్మా ఇదివరకు లేవు కదూ. వాకిట్లో మాధవీ లత, రాధా, మనోహరాలూ ఆనాటి తీగలేనా, మామయ్యా. అన్నట్లు ఎర్రగేదె ఏమైందీ? సుబ్బడు పాలేరు బాగున్నాడా?" ఇలా సాగాయి కబుర్లు.

"రాధబాబూ, బాగున్నావా?" పాత పాలేరు వచ్చి కుశల ప్రశ్నలతో అర్ధగంటవరకూ వదల్లేదు. పది రూపాయల కాగితం తెచ్చి అతని చేతిలో పెట్టినా వద్దంటూనే అందుకుని "పాత చొక్కా ఓటి పారేసి వెళ్ళు బాబూ" అంటూ అప్పటికి వెళ్ళిపోయాడు. మళ్ళీ కబుర్లు హైస్కూలు మీదికి వెళ్ళాయి.

"అన్నట్లు, మామయ్యా, అప్పటి మాస్టారెవరన్నా ఉన్నారా ఇప్పుడు?" హఠాత్తుగా అడిగాడు.

"ఒక రిద్దరు ఉన్నారు. అందులో డ్రిల్‌మాస్టారు మూర్తి ఒకరు. ఆయన సర్వీసంతా ఈ ఊరే - దాదాపుగా. ఆరునెలల క్రితం కాబోలు రిటైనారు. మగపిల్ల లిద్దరూ చదువులో పైకి రాలేదు. ఆడపిల్ల పెళ్ళికాక ఉండి ఉండి అన్యకులస్థుడితో లేచిపోయింది. ఆ అవమానం భరించలేక మాస్టారి భార్య ఆత్మహత్య చేసుకుంది. మగపిల్లలు బ్రతుకు తెరువుకోసం పట్నం చేరారు. ఓవైపు సంసారం చిరిగిన విస్తరిలా అవడం, మరోవైపు రిటైరై పోవడంతో దాదాపు మతి పోగొట్టుకున్నవాడిలా అయి మంచం పట్టాడు. అతని పాత శిష్యురాలు కాఫీకొట్టు కనకం కాఫీ వగైరా ఇస్తుంది ప్రతిరోజూ. అన్నమూ ఎవరో ఒకరు పెడుతూ ఉంటారు. ఎక్కడా లేకుంటే మనింటికి సరాసరి రమ్మనీ, నీకోసం ఇంటి తలుపు ఎప్పుడూ

డ్రిల్ మాస్టారూ ఎక్స్ స్టూడెంట్సూ
తెలిచే ఉంటుందనీ మరీ మరీ చెప్పాను. ఎంత చెప్పినా రెండు మూడుసార్లు తప్ప రాలేదు."

"అయ్యో!" నిట్టూర్చాడు రాధాకృష్ణ. మామయ్య తిరిగి చెప్పటం మొదలు పెట్టాడు.

"ఆయన మనస్తత్వం ఏమిటో అర్థం కావడంలేదు. రిటైరై పోయినా సరిగ్గా డ్రిల్ క్లాసులుండే సమయానికి డ్రెస్ వేసుకుని విజిల్ పట్టుకుని స్కూలుకు వెళ్ళి కూర్చుంటాడు. కొత్తలో ఏం చెప్పలేక హెడ్మాస్టరు మౌనంగా ఊరుకునే వారట. కానీ, కొత్తగా వచ్చిన డ్రిల్‌మాస్టారు కుర్రాడు. చికాకు పడ్డాడట. ఇంక హెడ్మాస్టరుగారు స్కూలుకి రావద్దని గట్టిగా చెప్పవలసి వచ్చింది. దానితో ఆయన డీలా పడిపోయి పిచ్చివాడిలా ఊరంతా తిరుగుతూ, కనిపించిన ప్రతి కుర్రాడినీ డ్రిల్ చేస్తావా అని అడగటం, ఎవరూ రానంటే ఊరు చివర గొడ్లకాపరులకి చాక్‌లెట్లూ మరమరాలూ కొనిచ్చి వాళ్ళచేత డ్రిల్ చేయించేవాడు. కొంత పాత అవగానే విసుగు కలగడం, గొడ్లు చేలల్లో పడటం, తండ్రులు వాళ్ళని చావగొట్టడం చాలా గందరగోళం జరిగిందట. ఇదంతా ఊళ్ళో అందరూ వింతగా చెప్పకుంటున్నారు. ఈమధ్య డ్రిల్‌మాస్టారు చాలా జబ్బు పడ్డారు. హెడ్మాస్టరు చాలా మంచివారు. పైగా ఆయన కొద్ది రోజుల్లోనే రిటైర్ కావలసిన వయస్సు. ఆయన ఈ డ్రిల్ మాస్టారుని వెయ్యి కళ్ళతో కనిపెట్టి చూస్తున్నారుట. డాక్టరుని తెచ్చి మందులు వాడి డ్రిల్ మాస్టారిని మామూలు మనిషిని చేశారు. ఒకవారం నించీ మరీ హుషారుగా ఉన్నా రెందుకో డ్రిల్ మాస్టారు! అంటే ఆయనకి ఎవరో డ్రిల్ చేసే కుర్రాడు దొరికి ఉంటాడు అనుకున్నాను. నిన్ననే చూశాను - ఆయన ముఖంలో ఏదోకొత్త కాంతి వచ్చింది" అంటూ కబుర్లు చెపుతూనే ఉన్నాడు మామయ్య. రాధాకృష్ణ అవన్నీ శ్రద్ధగా వింటూనే ఉన్నాడు లోపలనించి అత్త గట్టిగా కేక పెట్టింది.

"వంట అయింది. మధుమతికి ఆకలిగా ఉందిట. మేనమామా మేనల్లుడూ కాస్సేపు కబుర్లు కట్టి పెట్టాలి."

"అబ్బ, అప్పుడే భోజనమా"

"పన్నెండు గంటలు కావస్తూందిగా. భోజనం కాగానే నువ్వు రెస్టు తీసుకో, నే నలా హైస్కూలు దగ్గిరికి వెళ్ళాలి. నువ్వు నాలుగు గంటలకి అక్కడికి వస్తే చాలు. అన్నట్లు ఈ ప్రోగ్రామ్‌కి మీ ఎక్స్ స్టూడెంట్లలో ఆడపిల్లలు చాలామందే రావడం విశేషం. వాళ్ళందరికీ విడిది ప్రెసిడెంటుగారి ఇంట్లో. రాత్రికి విందు మాత్రం అందరికీ కలిసి ఉంటుంది" అంటూ భోజనానికి లేచాడు మామయ్య.

భోజనం చేసి రాధాకృష్ణ విశ్రాంతి తీసుకుంటూ ఉంటే తమల పాకులు పట్టుకుని మధుమతి వచ్చి దగ్గరగా కూర్చుని ఆకులు అందిస్తూ "మీ మామయ్యకే గనక ఓ ఆడనలుసు ఉన్నట్లయితే నే నెక్కడ ఉండే దాన్నో? హాయిగా ఇల్లరికం అల్లుడై ఉండేవారా" అంటూ నవ్వింది.

"జవాబు రెడీగా లేదు" అన్నాడు నిద్రమత్తు వదిలించుకోవాలన్న ట్లుగా.

"మీరింత పెద్దవారైనా చిన్నవాడిని పిలిచినట్లు ఆ 'రాధా' అన్న పిలుపేనా ఇంకా."చిరుకోపంతో అంటూంటే, "ఆ పిలుపులోని మాధుర్యం నీ కేం తెలుసు." అంటూండగానే శర్మా, శేషగిరీ వగైరా స్నేహితులు 'రాధాకృష్ణా' అంటూ వచ్చేశారు. తన బాల్యమిత్రుల్లో కొందరు ఇంజనీర్లు, కొందరు డాక్టర్లు, కొందరు పైలట్లు మరికొందరు వార్‌లోకి వెళ్ళిపోయారు. కొందరు వ్యాపారాల్లో స్థిరపడితే, మరికొందరు దొంగలై పట్టుబడి జైల్లో బంధించబడ్డారు. ఈ వివరాలు తెలుసుకున్న రాధాకృష్ణ ఆలోచనల్లో

మునిగిపోయాడు. ఒకే స్కూల్లో చదివినా, బ్రతుకుబాటలో ఒక్కొకరు ఒకోదారివైపు చీలిపోయారు. ఎంత విచిత్రమైందీ జీవితం అనిపిస్తూంది.

*        *        *        *

నాలుగు గంటలకే రాధాకృష్ణ పాత మిత్రులతోబాటు హైస్కూలు దగ్గరికి చేరుకున్నాడు. స్కూలు బిల్డింగ్ మరింత పెద్దదైంది. చుట్టూ ఖాళీస్థలం, దూరంగా మామిడితోట. అంతా అప్పటిలాగే ఉంది. కానీ, పెద్ద పందిరి. రంగు రంగు కాగితాలూ, మామిడి తోరణాలూ, ఎక్స్ స్టూడెంట్సుకి వెల్‌కమ్ అన్న బోర్డులూ చూస్తూ అప్పటికే వేదిక దగ్గరగా వేసిన కుర్చీల వరసలో ముందు కూర్చున్నాడు. చాలామంది వచ్చేశారు. ఎక్స్ స్టూడెంట్లు ఆహ్వానాలు అందుకుని వీలున్న వాళ్లు వచ్చారు. లేనివాళ్ళు టెలిగ్రాములద్వారా, ఉత్తరాలద్వారా శుభాకాంక్షలు పంపారు. మీటింగ్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి ముక్తసరిగా మూడు మాటలు చెప్పి ఊరు కున్నారు. హెడ్మాస్టరూ, లెక్కల మాస్టారూ మాట్లాడారు. ప్రోగ్రామ్‌కి వచ్చిన ఎక్స్ స్టూడెంట్లకి మరీ మరీ కృతజ్ఞత తెలిపారు. ఎలా ప్రారంభించి ఎలా అభివృద్ధి పరిచిందీ, ఈనాడెలా జరుగుతున్నదీ - స్కూలు చరిత్ర చెప్పారు. దాదాపు ప్రోగ్రామ్ పూర్తి కావస్తూంటే ఎక్స్ స్టూడెంట్సులో కొందరు మైక్ ముందు కొచ్చి మాట్లాడారు. హెడ్మాస్టరుగారు లేచి "రిటైరైన డ్రిల్ మాస్టారు మూర్తిగారు మాట్లాడాలని కోరుతున్నాను" అన్నారు. వెనక వరసలో కూర్చున్న మూర్తి ముందుకివచ్చి మైక్‌ని పట్టుకుని ఒక్కసారి అందరినీ కలియజూసి, గొంతు సవరించుకుని- "ముఖ్య అతిథులకి నమస్కారం. నా ప్రియశిష్యులకి ఆశీస్సులు. ముఖ్యంగా ఎక్స్ స్టూడెంట్సుని చూసే అవకాశం కలిగించిన హెడ్మాస్టరుగారికీ తదితర పెద్దలకీ చిన్నలకీ నా కృతజ్ఞతలు. నా కీ రోజు పెద్ద పండుగలా ఉంది. నేను మరిచిపోయినా నన్ను మరిచిపోని ఎక్స్‌స్టూడెంట్స్‌ని చూస్తూంటే మహదానందంగా ఉంది. ఇక్కడ చేరిన ప్రతి ఒక్కరూ ఈ స్కూల్లో

చదివినా 'డ్రిల్'లో పాల్గొని బయటికి వెళ్ళి తలో దారినా బ్రతుకుతూన్న వీళ్ళందరూ నాకు ప్రియాతి ప్రియమైన శిష్యులు. వీళ్ళని చూసుకుని ఈ రోజు గర్విస్తున్నాను.

నా కీ క్షణంలో భగవంతుడి మీద చాలా కోపం వస్తూంది. ఎందుకంటే నా ఈ స్టూడెంట్సు అందరినీ ఒకేసారి గట్టిగా హృదయానికి హత్తుకోవటానికి పెద్ద చేతుల నివ్వలేదే అని. నా కా అదృష్టంలేదు. ఈ చేతులు చాలా చిన్నవి" అంటూంటే ఆయన కళ్ళలో నీళ్లు చిప్పిల్లాయి. స్టూడెంట్సు చేస్తూన్న కరతాళధ్వనులతో ఆ పందిరి మార్మోగి పోయింది. "హెడ్మాస్టరు గారిచ్చిన సమయం మించిపోతూన్నా ఒక చిన్న అభ్యర్థన. నా కోరికకి హెడ్మాస్టరుగారికి, తదితర పెద్దలకి ఆభ్యంతరం ఉండదనుకుంటాను."

"ఏమిటి? ఏమిటి?" అందరి ముఖాల్లోనూ క్వశ్చన్‌మార్కు.

"ఒక్కసారి అంటే ఒక్కసారి నా ఎక్స్ స్టూడెంట్సు అందరిచేత అంటే అమ్మాయిలతోసహా ఒక్కసారి డ్రిల్ చేయించే అవకాశం నా కివ్వమని మరీ మరీ ప్రార్థిస్తున్నాను.'' ఆయన గొంతు పూడుకుపోయినట్లుంది. మరింకేం మాట రాలేదు.

ఆయన కోరిక అందరినీ ఆశ్చర్యపరచింది. క్షణం విస్తుపోయినా, అంతలోనే తేరుకున్న రాధాకృష్ణ చటుక్కున లేచి, "ఎస్. సార్, మేం రెడీ" అనడంలో మరికొందరు లేచి రెడీ, రెడీ అంటూ అరుస్తున్నారు. ఎక్స్ స్టూడెంట్సుగా వచ్చిన కొందరమ్మాయిలు ఒకరిముఖాలొకరు చూసుకుని క్షణం తటపటాయించినా, చటుక్కున లేచేసి 'మేంకూడా రెడీ, సార్' అన్నారు ఏక కంఠంతో. మళ్ళీ కరతాళధ్వనులతో మార్మోగిపోయింది ఆప్రదేశమంతా.

మూర్తి మాస్టారి ముసలి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. కళ్లనుంచి ఆనందబాష్పాలు జలజలా రాలుతూంటే ఆయన నోట మాటే

డ్రిల్ మాస్టారూ ఎక్స్ స్టాండబ్బా

రావటంలేదు. అయినా, గొంతు పెగుల్చుకుని కృతజ్ఞత చెప్పుకుని విజిల్ పట్టుకుని స్టేజీ దిగి క్రిందికి వస్తూంటే శర్మా, శాస్త్రీ, శీనూ, బాబూ, వర్మా వగైరా అమాంతం వచ్చి ఆయన్ని చేతుల మీద ఎత్తేసి "మూర్తి మాస్టారికీ జై, డ్రిల్ మాస్టారికీ జై" అంటూ స్కూలు గ్రౌండు వరకూ తీసుకువెళ్ళి అక్కడ దించారు. సభలోని వారంతా గుంపులుగా గ్రౌండు లోకి చేరారు.

రకరకాల దుస్తుల్లో ఉన్న అబ్బాయిలని రంగు రంగుల చీరెల్లో గాలికి రెపరెపలాడుతూన్న పమిటని తిప్పి దోపి రెడీ అన్నట్లు నిలుచున్న అమ్మాయిలనీ రెప్పవాల్చకుండా చూసుకుంటున్నారు డ్రిల్ మాస్టారు.

అబ్బాయిలకి రాధాకృష్ణ ముందు నిలుచున్నాడు. అమ్మాయిలకి ఆ నాడు లల్లీ అని పిలిస్తే ఏడుపు ముఖం పెట్టిన లలిత పెద్దదై కలెక్టరు భార్య అయి అత్తవారింటికి వెళ్ళినా, స్కూలు ఆహ్వానాన్ని అందుకుని కారులో వచ్చేసింది. అప్పుడు పిలక జడతో తాటాకు బొమ్మలా ఉండే లలిత ఇప్పుడు బొద్దుగా గుమ్మటంలా ఎర్ర పట్టుచీరె కట్టుకుని ముద్ద మందారంలా ఉంది. ఆ పిల్లవెనక ఉన్న పిల్లలూ రాధాకృష్ణవైపు చూస్తూ పలకరింపుగా నవ్వుతున్నారు. వాళ్ళలో కొందరిని గుర్తించి, మరికొందరు గుర్తురాకా అయినా నవ్వుతూనే జవాబిస్తున్నాడు. లలిత పెదవి విరిచి అందంగా నవ్వి కళ్ళు ఎగరేసింది.

"ఏయ్...ఎంత ధైర్యం" అనుకుంటూ పెదవి పంటితో కొరుక్కుంటూ లలిత పక్కన నిలుచున్న అమ్మాయిని ఎక్కడో, ఎప్పుడో చూసినట్లు అయి గుర్తుకి తెచ్చుకుంటున్నాడు.

ఆఁ అవును—ఈ అమ్మాయి...తను నైంత్‌లో వేసవి సెలవుల్లో అమ్మ దగ్గరికి వెళ్ళి తిరిగి స్కూలు తెరవగానే వచ్చిన తెల్లవారి పెరట్లో

[illegible] జామిచెట్టుకి ఉన్న దోర పండిన జామికాయొకటి [illegible] పళ్ళతో కొరికి తింటూ, మరోటి కనిపించి నోరు ఊరిస్తూంటే ఆ కాయనే చూస్తూ కొమ్మ వంచినా అందక ఎగిరి అందుకో బోతూంటే— "ఏయ్...ఎవరూ నువ్వు? జామకాయలు దొంగతనంగా కోస్తావా" అంటూ వచ్చి వీపుమీద ఒక్క చరువు చరిచింది. తను ఉలిక్కిపడి కోపంతో వెనక్కి తిరిగితే ఈ పిల్లే పరికిణీ, ఓణీతో, చేతిలో పువ్వుల బుట్టతో, సగం ఊడిన బారెడు జడ అల్లుకుంటూ కోపంగా చూస్తూ 'ఎవరు నువ్వు'అంటూ నిలదీసింది. ఆ పిల్ల అలా అనేసరికి నిజంగా ఒళ్ళు భగ్గుమంది.ఈ ఇంట్లో నన్ను 'నువ్వెవరు?' అని ఓ ఆడపిల్ల ఇలా నిలదీసి అడిగేస్తుందని ఎప్పుడూఅనుకోక తెల్లబోయి అంతలోనే కోపం ముంచుకు వచ్చి "అసలు నువ్వెవరు?" అని మీదికి వెళ్ళాడు.

"ఏయ్! నువ్వు నువ్వు....అంటూ ఆ పిల్ల పెద్ద గొంతుతో అత్తా, ఈ అబ్బాయి చూడూ—జాంకాయలు కోసుకునేది కాక నన్నే నువ్వెవ్వ రంటున్నాడు. మామయ్యా, త్వరగా రా, ఒరేనాంచారీ పట్టుకోరా అంటూ అరిచేస్తూంటే నిజంగా భయం వేసింది ఓ క్షణం. అంతలోనే మామయ్య గబగబా వచ్చి అర్థం కాక అంతలోనే అర్థం చేసుకొని విరగబడి నవ్వి ఆ పిల్ల కొత్తగా వచ్చిన డాక్టరుగారి చెల్లెలనీ, ఈ హైస్కూల్లోనే చేరబో తూందనీ చెప్పాడు. ఈ వేసవి సెలవుల్లో ఆ పిల్ల అత్త దగ్గిర చాలా చనువే సంపాదించేయడం గుర్తించిన తనకి ఆ పిల్లమీద చాలా అసూయ కల్గింది. అప్పుడప్పుడూ ప్రత్యర్థులై తగూకి దిగడం అత్త ఇద్దరినీ సర్దటం ఇలా ఓ ఆరు నెలలు గడపకుండానే పెళ్ళిచేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోతూ "నా మీద కోపం పెట్టుకోకు రాధాకృష్ణా" అని మరీ మరీ చెప్పి వెళ్ళిపోవడం గుర్తుకొచ్చింది. ఈ అమ్మాయిని అప్పుడు చూడడం మళ్ళీ ఇప్పుడు కనిపించింది. చిక్కి నల్లబడిపోయినా కళ్ళలో కాంతి మాత్రం తగ్గలేదు. అనుకుంటూ— 'గుర్తు పట్టానులే' అన్నట్లు నవ్వుతూండగానే డ్రిల్ మాస్టారి విజిల్ వినిపించి సరిగ్గా నిలబడి మాస్టారి వైపుకి తిరిగాడు రాధాకృష్ణ.

డ్రిల్ మాస్టారూ ఎక్స్ స్టూడెంట్సూ

ఈ 'డ్రిల్'ని చూడటానికీ ఆ ఊరి ప్రజలు విరగబడ్డారు. ముందుక్కి తోసుకువస్తున్న జనాన్ని అదుపు చేయటానికి కష్టమైపోతోంది వలంటీర్లకి. మంత్రిగారూ, హెడ్మాస్టరూ చిత్తరువుల్లా "చూస్తున్నారు, మంత్రిగారు నవ్వుతూ 'మాస్టారూ నేనూ ఈ స్కూలు ఎక్స్ స్టూడెంట్స్‌ని అయి ఉంటే ఎంత బాగుండేది! కానీ, కానీ అనటంతో మళ్ళీ నవ్వుల జల్లు కురిసింది. డ్రిల్ పూర్తి అయింది. మరోసారి డ్రిల్ మాస్టారికి జైకొట్టి అందరూ వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు. రాధాకృష్ణ ముఖాన పట్టిన చెమటని కర్చీఫ్‌తో అద్దుకుంటూ చుట్టూ చూసాడు. కాస్తదూరంలో మధుమతీ, అత్తయ్యా వగైరా ముసిముసి నవ్వులు నవ్వుతూంటే చటుక్కున ముఖం పక్కకి తిప్పుకున్నాడు. ఇంక ఒక చిన్న ప్రోగ్రామ్ ఇప్పటి స్టూడెంట్సు వేస్తున్న నాటిక, ఎక్స్ స్టూడెంట్సు ఏకపాత్రాభినయం, లలిత ఫిడేల్ కచేరీ వగైరా అయిన తరవాత రాధాకృష్ణను బలవంతంగా ఓ పాట పాడమని లాక్కుపోయారు. ఘంటసాల పాడే ఓ పాత పాటతోబాటు కరుణశ్రీ పద్యాలుకూడా పాడందే వదల్లేదు. ఎన్నో సంవత్సరాల తరవాత హఠాత్తు ఇలా ఈ స్టేజిమీద తను మళ్ళీ గొంతెత్తి పాట పాడవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు రాధాకృష్ణ. చిన్నప్పుడు ఈ స్కూలు ప్రోగ్రామ్‌లో ఎన్నో బహుమతులు అందుకున్నా, ఈ నాడు ఏదో కొత్తగా, తృప్తిగా, ఆనందంగా, ఎలాగో చెప్పటం చేతకానంత మధురంగా ఉంది ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొనటం.

"డాడీ! వన్, టూ..." అంటూ పగలబడి నవ్వుతూ పరుగున వచ్చి చేతులు పట్టుకున్నారు పాపా, బాబూ. వాళ్ళలా అంటూ ఉంటే సిగ్గు వేసింది అరక్షణం. అంతలోనే తనని తను సంబాళించుకుని లలితకీ, మిగతా వాళ్ళకీ తన పిల్లలని చూపించాడు. వాళ్ల ఏవేవో చెప్తూనే లేచి ఇవతలికి వచ్చారు.

పాత స్నేహితుల పలకరింపులూ అవీ అయి ఇల్లు చేరబోతూఉంటే ప్రెసిడెంటుగారు పిలిచి మరీ చెప్పారు.

"రాధాకృష్ణా! ఓ అరగంటలోనే డిన్నర్‌కి అందరూ తప్పక హాజరు కావాలి. కావాలంటే మీ మామయ్య ఇంట్లో నెల ఉండి తిను" అంటూ వెళ్ళిపోయారు. హడావిడిగా.

"మేమూ బట్టలు మార్చుకుని అక్కడికి వస్తాం. తీరుబడిగా కబుర్లు చెప్పాలి." అంటూ నెచ్చెలులతో వెళ్ళిపోయింది లలిత.

"ఛీ...సిగ్గులేకుండా ఇంత పెద్దై ఏంటా డ్రిల్?" మధుమతి ముఖం గంటు పెట్టుకుంది.

'నీకేం తెలుసు. నీ ముఖం' అంటూ తేలిగ్గా నవ్వేసి విందుకి వెళ్ళాడు.

నవ్వులతో, కేరింతలతో, జోక్‌లతో విందు పూర్తి అయింది. మామయ్య, ప్రెసిడెంటుగారు పళ్ళెం పట్టుకుని వడ్డనకి రావటంతో నవ్వుల వర్షం కురిసింది. ఎవరి ముఖాల్లో చూసినా సంతోషం వెల్లివిరుస్తోంది. ఈ ఆనందం డబ్బుతో కొనగలిగిందా! దీనికి విలువ గట్టగలడా ఎవరన్నా! తనని తను ప్రశ్నించుకుంటూ ఇంటికి బయలుదేరుతూంటే, పూవులరథం శర్మ లారీ తీసుకు వచ్చిన శాస్త్రీల నన్నింటినీ తిరిగి గమ్యం చేర్చేందుకు నిండుగా బయలు దేరుతోంది. "ఎక్స్ స్టూడెంట్సుకీ జై' అంటూవీడ్కోలు మ్రోతలో ఆ లారీ నిజంగా పూలరథంలానే కదిలి వెళ్ళిపోయింది.

* * * *

రాధాకృష్ణ ఇల్లు చేరేసరికి పది గంటలు దాటిపోయింది. అరుబైట వేసిన ప్రక్క మంచంమీద సుఖనిద్రలో ఉన్న భార్యనీ, పిల్లలనీ

ఓ సారి చూసి తృప్తిగా మేను వాల్చాడు. కానీ, నిద్రవచ్చేలా లేదు. ఆకాశంలోకి చూస్తూంటే చందమామ మబ్బులచాటున దోబూచులాడుతున్నాడు. చల్లటిగాలి మెల్లగా వీస్తోంది. సామాన్యంగా పట్నవాసం జీవితంలో ఈ అవకాశం ఉండదు. ఈ స్వచ్ఛమైన గాలీ కరువే.

అవసరాలు పెంచుకుని వాటిమధ్య నలిగిపోతూ ప్రకృతికి దూరమైపోయే ఈనాటి నాగరికుడికి అసలైన సుఖం దొరుకుతోందా! అన్న ప్రశ్న నిలదీస్తోంది రాధాకృష్ణని.

పట్నవాసాలేకాదు, ఇప్పుడిప్పుడు పల్లెటూళ్ళు కూడా నకిలీ నాగరికతకి ఆలవాలం అయిపోతున్నాయి. ఇలా కాకూడదు. నిజమే. కానీ, అలా కాకుండా ఏ శక్తి ఆపలేదే.

రాధాకృష్ణ మనస్సు ఏదో తెలియని బాధతో మూలిగింది. అంతలోనే ఆలోచనలు సాయంకాలం జరిగిన ప్రోగ్రామ్ గుర్తుకొచ్చి సంతోషంతో మనస్సు ఉరకలు వేస్తూంటే అలా అలా కళ్ళమీదకి నిద్ర ముంచుకు వచ్చేసింది. అలా ఎంతసేపు నిద్రపోయాడో ఒళ్ళు తెలియదు.

"రాధా! ఒరేయ్, రాధా' అని మేనమామ తట్టి లేపుతూంటే ఉలిక్కిపడి కళ్ళు తెరిచి లేచి కూర్చుంటూ 'ఏంటి మామయ్యా' అన్నాడు.

"మన జీతగాడి చెల్లెలు సావిత్రికి మొదటి కానుపురా. మూడు రోజులుగా బాధపడుతోంది. నాటు మంత్రసాని నావల్ల కాదందిట. డాక్టరన్నా ఊళ్ళోలేడు. బస్తీకి తీసుకుపోయేందుకన్నా సమయం లేదు అంటూ ఏడుస్తూ వచ్చాడు. కాస్త నువ్వు వెళ్ళి చూడాలి. పద బట్టలు వేసుకో."

"అరే, నా దగ్గిర మందులూ ఇంజెక్షన్‌లూ ఏం లేవే!" అంటూంటే అవేం కావాలో డాక్టరింట్లో తీసుకో. భార్య చాలా మంచిది-నీ కేం కావాలన్నా ఇస్తుంది. త్వరగా రా" మామయ్య త్వరపెడుతూంటే గబగబా

బట్టలు వేసుకొని బయలుదేరాడు. మధుమతి "ఇక్కడికి వచ్చినా ఈ గోలేనా?'' అని విసుగ్గా ముఖం పెట్టినా అయ్యో, పాపం, కాన్పు కేసు కాబోలు అనుకుని శాంతపడింది.

లాంతరు వెలుగులో ఊరి చివరికి జీతగాడు దారి చూపిస్తూంటే గతుకుల రోడ్డు, దాటి చిన్నసందు గొందులు దాటి గూడెం చేరుకున్నాడు. సావిత్రి పరిస్థితి ప్రమాదంగా ఉందని గ్రహించి కావలసిన మందులు పరుగుల మీద తెప్పించి వాడి ఎలాగో కాన్పు అయేలా చేశాడే కానీ, పెద్ద ప్రాణం దక్కింది.పిల్ల పోయింది. అయినా పాలేరు బాధపడక రాధాకృష్ణ కాళ్ళకి దణ్ణం పెట్టాడు.

వాళ్ళ ఇల్లు వదిలి వీథిలోకి రాకముందే లాంతర్లు పట్టుకుని నలుగురు పరుగున వచ్చారు.

"డాక్టరు బాబూ, దబ్బున రావాలి. ఒంటెద్దు బండీ రెహమాన్‌కి హఠాత్తుగా విషమించింది. మీకోసం మామయ్య ఇంటికి వెళ్ళి లేరంటే ఇక్కడికి వచ్చాం'' అని రొప్పుతూ చెప్పారు.

అలిసిపోయి ఉన్న రాధాకృష్ణ అదేం పట్టించుకోకుండానే పదండి, త్వరగా అంటూ వాళ్ళ వెంట నడిచాడు.

"మా ఊరి డాక్టరు మాయదారోడు. అవసరం వచ్చినప్పుడే ఊరొదిలి బస్తీ పోతాడు'' అంటూ తిడుతూన్నారు ఇద్దరు.

''అసలేం జరిగింది" అని అడిగితే వాళ్ళలో ఒకడు "ఏం లేదు, బాబూ! సాయంకాలం కోడీగీడీ మస్తుగా తినేశాడు. ఆపైన తెగ తాగేశాడు. ఇంకా ఓ నిద్రపోయి లేచాడో లేదో పెమాదం ముంచుకొచ్చేసిందిట. ఆడి తల్లి ఏడుస్తా వచ్చి నన్ను నిద్ర లేపింది. అసలే ఒంటరిది - అందులో ముసల్ది. ఏం చేస్తుంది?"

రెహమాన్ పూరి గుడిసెలో అప్పటికే ఓ ఇరవైమంది దాకా పోగయ్యారు. ఆఖరి క్షణాల్లో ఉన్నా వాళ్ళేం చేయలేక దేవుడిమీద భారం వేసి అలా చూస్తూ నిలుచున్నారు.

డాక్టరు వచ్చాడు అన్నమాట వింటూనే రెహమాన్ తల్లి అమాంతం పరుగున వచ్చి రాధాకృష్ణని వాటేసుకుని గోల్లుమంటూ "బాబూ, డాక్టరు బాబూ నీ చిన్నప్పటి దోస్తుని రక్షించేందుకు ఆ అల్లాయే నిన్నిక్కడికి పంపాడు. రా, బాబూ, నా బిడ్డని కాస్త చూడు. సూదివేసి బ్రతికించు నాయనా. నీకు వెయ్యేళ్ళు ఆయుష్ అంటూ పిచ్చిదానిలా ఏడుస్తోంది.

రాధాకృష్ణ గుండె క్షణం కొట్టుకోవటం ఆగింది. ధైర్యాన్ని కూడదీసుకుంటూ వంగి గుడిసెలోకి వెళ్ళాడు. రెహమాన్‌ని పరీక్షించాడు. లాభంలేదు. అప్పుడే అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయి అయిదు నిమిషాలు పైనే అయి ఉండవచ్చు. అతను చలన రహితంగా ఉంటే నిద్రపోతున్నా డనుకుంది తల్లి.

రెహమాన్‌ని చూస్తూ స్థాణువులా నిలిచిపోయిన రాధాకృష్ణ తెప్పరిల్లి దుప్పటి ముఖం వరకూ కప్పి వెనక్కి తిరిగాడు. రెహమాన్ తల్లి ఇంజెక్షన్‌కి వేణ్ణీళ్లు కావాలా అంటూ అదిచూసి 'రాధ బాబూ ఇదేంటి' అంటూ రాధాకృష్ణని అమాంతం పట్టేసుకుంది.

"నా బిడ్డ - నీకు ఎన్నోసార్లు బండీ కట్టిన నీ దోస్తని బ్రతికించలేవా. నువ్వు ఏం చెయ్యలేవా పెద్ద చదువులు చదివిన డాక్టరువే నువ్వు నా రెహమాన్‌న్ని కాపాడలేవా! వా డొక్కడే బాబూ. నాకు బిడ్డ'' అంటూ హృదయ విదారకంగా ఎడుస్తూంటే అక్కడ మూగిన కొందరు ఆమెని పట్టుకున్నారు. రాధాకృష్ణ అతి కష్టంమీద ఆమె చేతుల నుంచి తప్పించుకుని ఉబికి వచ్చే కన్నీళ్ళని ఎవరూ చూడకుండా ఒత్తుకుని ఎలాగో ఇల్లు చేరాడు. మనస్సంతా చేదు తిన్నట్లు అయింది.

ఈ స్కూలు ప్రోగ్రామ్‌కోసం ఈ ఊరు రావటం, సరిగ్గా ఈ రోజే కల్తీసారా తాగి రెహమాన్ హఠాత్తుగా మరణించడం. అందులోనూ తను ఈ ఊరిలో ఉండీ సహాయం అందకుండా మిత్రుడు మరణించడం-కదిలించేస్తోంది. ప్రాణం ఉండగానైతే రోగంతో పోరాడి తన అనుభవాన్ని ధారపోసి బతికించడానికి ప్రయత్నించేవాడు. కానీ ప్రాణంలేని ఆ శరీరాన్ని తను కదిలించలేడు. తన విజ్ఞానం చాలదు. రాధాకృష్ణ ఇంటికి వచ్చినా రెహమాన్ ముసలి తల్లి ఏడుపే ఇంకా వినిపిస్తోంది చెవులకి.

మధుమతి భర్తని ఏదో ప్రశ్నించబోయి ఆగిపోయి లుంగీ అందించింది.

"రాధా, కాస్త కాఫీ తాగుతావా." మేనల్లుడి అలసట చూసి బాధగా అడిగింది అత్త.

'వద్దు' అంటూ కళ్ళు గట్టిగా మూసుకుని పడుకున్నాడు. తెల్లవారి ఎనిమిది దాటిన తరవాతగానీ నిద్ర లేవలేదు.

* * * *

లేస్తూనే కాఫీ తాగి 'వెళ్ళిపోతాం, మామయ్యా' అన్నాడు.

"పిల్లేదురా!" నీ క్లాసు పిల్లలని లలితా-సుజాతాని ఈవేళ భోజనానికి పిలిచాను" అని బలవంతంగా ఆపాడు. భోజనానికి వచ్చిన లలితతో, మిగతా వాళ్ళతో యాంత్రికంగా మాట్లాడాడు కానీ, సంతోషం లేదు అతనిలో. సాయంత్రం ఐదు అవగానే కారులో బయలుదేరారు. భార్యాపిల్లలూ మేనమామ పెట్టిన కొత్త బట్టలు కట్టుకున్నారు. రాధాకృష్ణనికూడా పంచెలు కట్టుకొందే వదల్లేదు అత్త. స్కూలుకి డొనేషన్‌గా అయిదు వందలు ఇచ్చి ప్రయాణమై ఊరు చివరికి వస్తూండగా హైస్కూలు దగ్గర కారు కాస్త నెమ్మదిగా పోనివ్వమని ఆ స్కూలుని చూస్తూ డోర్ తెరుచుకుని దిగి కారుని ఆనుకుని అలా క్షణం నిలిచిపోయాడు.

స్కూలు గ్రౌండులో హెడ్మాస్టరుగారిచేత డ్రిల్ చేయిస్తూన్న డ్రిల్ మాస్టారు కనిపించి నిటారుగా నిలుచున్నాడు రాధాకృష్ణ.

అసలే స్థూల శరీరం. అందులో యాభై దాటిన వయస్సూ. అయినా, డ్రిల్ మాస్టారు మనశ్శాంతికోసం తనే స్టూడెంటుగా మారి ఆయాస పడుతూ ఆయన డ్రిల్ చేస్తూంటే రాధాకృష్ణకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఎంత మంచి మనస్సు హెడ్మాస్టరుగారిది! పరుగున వెళ్ళి ఆయన్ని ప్రక్కకు తోసి తను డ్రిల్ చేయాలనిపించింది. కానీ, ఆవేశాన్ని ఆపు కుంటూ ఆగిపోయాడు. నేనీ ఒక్కరోజు చేసి ప్రయోజనం లేదుగా. అనుకుంటూ మనసులోనే ఆ ఇద్దరు మాస్టర్లకి నమస్కరిస్తూ ఏదో కొత్త జీవితంలోకి అడుగు పెడుతూన్నట్లుగా లోలోపల ఏదో నిర్ణయాలు చేసుకుంటూ వెళ్ళగానే హెడ్మాస్టరుగారికి ఉత్తరంలో తన నిర్ణయాలని తెలపాలని ఊహించుకుంటూ కారులో కూర్చుని, డోర్ వెయ్యగానే కారు కదిలి ముందుకు దూసుకుపోయింది. కానీ, రాధాకృష్ణకి డ్రిల్ మాస్టారూ, ఆయన ఆజ్ఞలని తూ. చా. తప్పకుండా పాటించే హేడ్మాస్టరూ మనస్సులో కదులుతున్నారు.

*